# చేతులు నాభి క్రింద వుంచడాన్ని సూచించే హదీసు యొక్క బలహీనత

(అల్లామా అల్‌బానీ గారి ఇర్వాఉల్ గలీల్ – 353 ఆధారంగా)

అబూదావూద్ (756), దారెఖుత్ని (107), బైహఖి (2/310), అహ్మద్ తన కుమారుని అబ్దుల్లాహ్ మసాయల్ (62/2), జవాయద్ అల్ ముస్నద్ (1/110) మరియు ఇబ్నె అబీ షైబా (1/156/1) ఈ క్రింది పరంపరతో దీనిని ఉల్లేఖించారు:

"అబ్దుర్రహ్మాన్ ఇబ్నె ఇస్‌హాఖ్ ద్వారా, ఆయన జియాద్ ఇబ్నె జైద్ అస్సివాయి ద్వారా, ఆయన అబూ జుహైఫా ద్వారా, ఆయన అలీ (రజి అల్లాహు అన్హు) ద్వారా తను ఇలా సెలవిచ్చారని తెలియజేశారు:

"నమాజులో చేతులను ఒకదానిపై మరొకటి వుంచి నాభి క్రింద పెట్టుకోవడం సున్నత్."

కానీ దీని పరంపర 'అబ్దుర్రహ్మాన్ ఇబ్నె ఇస్‌హాఖ్' (అల్ వాసితి అల్ కూఫీ) కారణంగా బలహీనమైనది. కారణం అతను బలహీన ఉల్లేఖకుడు. అంతేగాక ఈ పరంపరలో కూడా బలహీనత (ఇజ్తిరాబ్) వున్నది. ఎందుకంటే –

**అబ్దుర్రహ్మాన్ ఇబ్నె ఇస్‌హాఖ్**

– ఓసారి జియాద్ ద్వారా, ఆయన అబూ జుహైఫా ద్వారా ఆయన అలీ ద్వారా (పైన వివరించబడ్డ పరంపర) అన్న పరంపరతో ఉల్లేఖించాడు.

– మరోసారి – నోమాన్ ఇబ్నెసాద్ ద్వారా ఆయన అలీ ద్వారా – అన్న పరంపరతో ఉల్లేఖించాడు. (దారెఖుత్ని, బైహఖి)

– ఇంకోసారి – సియాస్ అబుల్ హకమ్ ద్వారా, ఆయన అబూ వాయిల్ ద్వారా, ఆయన అబూ హురైరా ద్వారా – అన్న పరంపరతో ఉల్లేఖించాడు. (అబూదావూద్, దారెఖుత్ని)

**హదీసువేత్త (ముహద్దిసీన్)ల దృష్టిలో అబ్దుర్రహ్మాన్ ఇబ్నె ఇస్‌హాఖ్ బలహీనత**

1. అబూదావూద్ యిలా పేర్కొన్నారు: ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ అబ్దుర్రహ్మాన్ ఇబ్నె ఇస్‌హాఖ్ అల్ కూఫీని బలహీన ఉల్లేఖకుడిగా ప్రకటిస్తుండగా నేను విన్నాను.

   (అందుకే ఇమామ్ అహ్మద్ ఈ హదీసును స్వీకరించలేదు. ఆయన కుమారుడు అబ్దుల్లా యిలా సెలవిచ్చారు: నేను మా నాన్నగారిని – నమాజులో తన రెండు చేతులను నాభిపైన పెట్టుకోవడం చూశాను.)

2. ఇమామ్ నవవీ తన మజ్మూ (3/313) మరియు 'షరహ్ ముస్లిం' నందు యిలా పేర్కొన్నారు: వారు (హదీసువేత్తలు) ఏకగ్రీవంగా ప్రకటించిన విషయమేమిటంటే – ఈ హదీసు బలహీనమైనది. కారణం ఇది అబ్దుర్రహ్మాన్ ఇబ్నె ఇస్‌హాఖ్ అల్ వాసితి ఉల్లేఖనం మరియు అతను బలహీన ఉల్లేఖకుడు. ఈ విషయంతో 'జరహ్ వ తాదీల్' ఇమాములు కూడా ఏకీభవించారు.

3. జైలయి తన నస్బుర్రాయ్ (1/314) నందు, బైహఖి తన 'అల్ మారిఫా' నందు యిలా పేర్కొన్నారు: దీని పరంపర పటిష్టంగా లేదు. కారణం ఇది అబ్దుర్రహ్మాన్ ఇబ్నె ఇస్‌హాఖ్ అల్ వాసితి యొక్క ఒకే ఒక్క ఉల్లేఖనం మరియు అతను ఒక మత్రూక్ (త్యజించబడ్డ) ఉల్లేఖకుడు.

4. హాఫిజ్ ఇబ్నె హజర్ తన ఫతహుల్ బారి (2/186) నందు యిలా పేర్కొన్నారు: ఇదొక బలహీన హదీసు.

   ఈ హదీసు బలహీనతకు గల మరొక కారణమేమిటంటే – స్వయానా అలీ (రజి అల్లాహు అన్హు) ద్వారా, దీనికి విరుద్ధంగా, ఉత్తమమైన పరంపరతో యిలా ఉల్లేఖించబడింది:

   ఇబ్నె జరీర్ అల్ దబ్బి తన తండ్రి ద్వారా ఆయన కథనాన్ని యిలా ఉల్లేఖించారు: "నేను అలీ (రజి అల్లాహు అన్హు)ను, తన కుడి చేతిని ఎడమ చేతి మణికట్టును పట్టుకొని నాభిపైన వుంచడం చూశాను."

   దీని పరంపర 'హసన్' కోవకు చెందినది. బైహఖి (1/301) దృఢంగా దీనిని 'హసన్' అని ప్రకటించారు మరియు బుఖారీ (1/301) దీనిని సంక్షిప్త (తాలీఖ్) రూపంలో ఉల్లేఖించడం ద్వారా దీని ప్రమాణికతను ధృవపరిచారు.

   **కనుక దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా ప్రామాణికంగా**

**నిరూపించబడిన విషయమేమిటంటే – నమాజులో చేతులను ఛాతీపై పెట్టుకోవాలి, నాభిక్రింద కాదు.**